క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ శ్రేణుల సమావేశం

తర్లుపాడు: వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంపై తర్లుపాడు మండల విస్తృత స్థాయి సమావేశం మార్కాపురంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. హామీల అమలులో చంద్రబాబు ప్రజలకు చేస్తున్న మోసంపై పార్టీ కార్యకర్తలకు అన్నా అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వైస్ సర్పంచ్‌లు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

మర్కటాల దండయాత్ర!



ముండ్లపాడులో బ్రహ్మంగారి ఆలయ సమీపంలో కోతుల గుంపు

గిద్దలూరు రూరల్: గుంపులుగా సంచరిస్తున్న కోతులతో గిద్దలూరు మండలంలోని ముండ్లపాడు గ్రామ ప్రజల బెంబేలెత్తుతున్నారు. ఇళ్లలోకి చొరబడి కనిపించిన వస్తువులు, ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తున్న కోతులను అదిలించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే అవి తిరగబడుతున్నాయి. మూడు రోజుల క్రితం గ్రామంలోని షేక్ మాబున్నీ, రజక వీధిలోని రాంబాబు అనే వ్యక్తులపై కోతులు దాడి చేసి గాయపరిచాయి. దీంతో వారు గిద్దలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుని తిరిగి ఇంటికి వెళ్లారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కోతుల బారి నుంచి రక్షణ కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పొదిలి రూరల్: మలేరియా, డెంగీ వ్యాధులపై ప్రజలు అవగహన కలిగి ఉండాలని ఉప్పలపాడు సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణ సూచించారు. మంగళవారం ఈగలపాడులో డెంగీ వ్యాధిపై అవగహన ర్యాలీ నిర్వహించారు. సబ్ యూనిట్ ఆఫీసర్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ తాము నివాసం ఉంటున్న ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తొట్లు, డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి, వాటిని శుభ్రం చేసుకోవాలని చెప్పారు. జ్వరం బారిన పడితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వీవీ వరసారెడ్డి, సీహెచ్‌ఓ సునీత, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో బాలికకు గాయాలు

పొదిలి: పట్టణంలోని నవాబ్‌మిట్టలో ఇంటి నుంచి బయటకు వచ్చిన బాలికపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు షేక్.రహీమా అనే బాలిక వారి ఇంటి బయటకు రాగా అక్కడే ఉన్న కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి గాయపరిచాయి. బాలికను ఆమె తల్లిదండ్రులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యం అందించారు. పట్టణంలో తరుచూ కుక్కలు దాడి చేసి గాయపరుస్తుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో గరుడ ఆళ్వార్



భక్తులకు దర్శనమిస్తున్న అల్లూరి పోలేరమ్మ

మార్కాపురం టౌన్: శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో గరుడ ఆళ్వార్‌కు మంగళవారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గరుడ పంచమిని పురస్కరించుకుని విష్ణుమూర్తి వాహనమైన గరుడ ఆళ్వారుకు పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే నాగ పంచమి సందర్భంగా అల్లూరి పోలేరమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

పట్టణ పేద.. గూడు బాధ!

టిడ్కో ఇళ్లకు రూ.62.2 కోట్లు మంజూరు చేసిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

2024 సార్వత్రిక ఎన్నికల నాటికి రూ.45 కోట్లతో 80 శాతం పనులు పూర్తి

- 2019లో టిడ్కో ఇళ్ల పేరుతో టీడీపీ ఎన్నికల స్టంట్
- పునాదులు తవ్వి పేద, మధ్య తరగతి ప్రజలను మభ్యపెట్టే యత్నం
- గద్దెనెక్కి ఏడాదైనా టిడ్కో ఇళ్ల ఊసెత్తని కూటమి సర్కార్
- మిగులు పనులు, మౌలిక వసతుల కల్పనలో అలవిమాలిన జాప్యం



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో గృహాలు

మార్కాపురం:

పేద, మధ్య తరగతి ప్రజల సొంతింటి కల నెరవేరేందుకు మరింత సమయం పట్టేలా ఉంది. టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాల్సిన కూటమి ప్రభుత్వం గడిచిన ఏడాది నుంచి సాగదీత ధోరణి అవలంబిస్తుండటమే అందుకు కారణం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులైన పట్టణ పేదలకు ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది. దాదాపు 80 శాతానికిపైగా నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈలోగా సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా టిడ్కో భవన నిర్మాణ పనులు నత్తతో పోటీపడుతున్న తీరు విమర్శలకు తావిస్తోంది. 2018 నవంబర్ 29న నాటి పంచాయతీరాజ్‌శాఖ మంత్రి నారా లోకేష్, పురపాలక శాఖామంత్రి పి.నారాయణ తదితరులు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద పట్టణ పేదల కోసం నాగులవరం రోడ్డులో టిడ్కో ఇళ్లకు శంకుస్థాపన చేశారు. ఈ ఇళ్ల నిర్మాణ పనులను ఎల్‌అండ్‌టీ కన్‌స్ట్రక్షన్స్, షాపూర్‌జీ పల్లోంజీ ఇంజినీరింగ్ సంస్థకు అప్పగించారు. 2019లో నిర్మాణ ప్రదేశంలో పునాదులు తవ్వగానే ఎన్నికల కోడ్ రావడంతో పనులకు బ్రేక్ పడింది. అప్పట్లోనే ఇళ్ల నిర్మాణ ప్రారంభ సమయంపై తీవ్ర స్థాయిలో విమర్శలొచ్చాయి. ఎన్నికలకు ముందు హడావుడిగా శంకుస్థాపన చేయడం ద్వారా పేదలను మభ్యపెట్టి ఓట్లు పొందాలన్న ఎత్తుగడ వేశారని నాటి టీడీపీ ప్రభుత్వ పెద్దలపై తీవ్ర స్థాయిలో విమర్శలొచ్చాయి. 2019 ఎన్నికల్లో అధికారం చేపట్టిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం.. పునాదుల దశలోనే ఉన్న టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని కొనసాగించి, పేదలకు ఒక రూపాయకే ఇల్లు ఇస్తామని ప్రకటించింది. వాయిదాలు చెల్లించాల్సిన అవసరం లేదని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం సంచలనమైంది. కరోనా విజృంభిస్తున్న సమయంలో కూడా టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు ఆపకపోవడంతో పురోగతి కనిపించింది.

లబ్ధిదారులకు భంగపాటు

మార్కాపురం నుంచి పెద్దనాగులవరం వెళ్లే రహదారిలో మొత్తం 912 మంది పేదలకు గృహాలు నిర్మించేందుకు నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 62.2 కోట్ల రూపాయలు కేటాయించింది. సుమారు 45 కోట్ల రూపాయలు వెచ్చించి 80 శాతం పనులు పూర్తి చేశారు. ఈలోపు గతేడాది ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో నిలిచిపోయిన పనులు తిరిగి ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. కూటమి ప్రభుత్వంలో పనులు వేగంగా సాగుతాయని ఆశించిన లబ్ధిదారులకు భంగపాటు తప్పలేదు. టిడ్కో ఇళ్ల సముదాయంలో విద్యుత్ సౌకర్యం కల్పించడంతో, మంచినీటి వసతి, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాల్సి ఉంది. అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ పనులన్నీ ఎప్పటికి పూర్తవుతాయో అటు అధికారులు గానీ ఇటు ప్రజాప్రతినిధులు గానీ స్పష్టం చేయకపోవడంతో లబ్ధిదారులు ఉసూరుమంటున్నారు. సొంతింటి కల నెరవేరుతుందని సుమారు ఏడేళ్లుగా ఎదురుచూస్తున్నామని, ఇప్పటికీ బాడుగ ఇళ్లలో బతుకుతూ ఆర్థికంగా అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా టిడ్కో ఇళ్ల మిగులు పనులను పూర్తి చేసి, మౌలిక వసతులు కల్పించాలని వేడుకుంటున్నారు. పట్టణ పేదలకు చెందిన గృహాల నిర్మాణంలో జాప్యానికి గల కారణాలపై సంబంధిత అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.



ఇళ్ల మధ్య నిలిచిన మురుగు



డ్రైనేజీ లేక, ఎగుడుదిగుడుగా ఉన్న అంతర్గత రోడ్లు

కలెక్టర్‌కు సమస్యల మొర

- కంభం, బేస్తవారిపేట మండలాల్లో వినతుల వెల్లువ
- పరిశీలించి పరిష్కరిస్తానన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

కంభం: ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఎదుట మొరపెట్టుకున్నారు. మంగళవారం కంభం మండలంలో పర్యటించిన కలెక్టర్‌ను పలువురు సర్పంచులు, ప్రజలు, రైతులు కలిసి సమస్యలపై లిఖిత పూర్వకంగా అర్జీలు అందజేశారు. సమస్యల పూర్వాపరాలు వివరించి, పరిష్కరించాలని వేడుకున్నారు. సమస్యలపై స్థానిక అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని, మీరే చొరవ తీసుకుని న్యాయం చేయాలని కలెక్టర్‌కు విన్నవించగా అర్జీలు పరిశీలించి న్యాయం చేస్తానని చెప్పారు.

పొలాల్లో మూడు నెలలుగా కరెంటు లేదు

జంగంగుంట్ల సబ్ స్టేషన్ పరిధిలోని సూరేపల్లి, లింగోజీపల్లి పంట పొలాల్లో మూడు నెలలుగా కరెంటు లేదని స్థానిక రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ శాఖాధికారులకు ఎన్ని సార్లు చెప్పినా సమస్యను పరిష్కరించడంలేదని వాపోయారు. మిరప నాటుకోవాలంటే నీరు అవసరమని, కరెంటు లేక బోర్లు పనిచేయడం లేదని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

మదర్ థెరిసా కాలనీకి రోడ్డేయాలి

కందులాపురం పంచాయతీ పరిధిలో సుమారు 20 ఏళ్ల క్రితం ఏర్పడిన మదర్ థెరిసా కాలనీకి మెయిన్ రోడ్డు నుంచి లింక్ రోడ్డు లేకపోవడంతో కాలనీ వాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ బత్తుల తిరుపాలమ్మ(రజని) కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. పలుమార్లు రెవెన్యూ అధికారులు, జిల్లా అధికారులు కాలనీని పరిశీలించినా సమస్య పరిష్కారం కాలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి

మేజర్ పంచాయతీలైన కంభం, కందులాపురంలోని పలు వీధుల నుంచి మురుగు నీరు వైజంక్షన్ మీదుగా వెళ్తుంది. హైవే వద్ద నిర్మించిన కల్వర్టు కింద నుంచి నీరు పారకపోవడంతో సమస్య తలెత్తుతోంది. హైవే అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించడం లేదని కంభం సర్పంచ్ పల్నాటి బోడయ్య కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

అండర్ పాస్ నిర్మించాలి

రైల్వే డబ్లింగ్‌లో భాగంగా మండలంలోని సైదాపురం వద్ద రైల్వే గేటు తొలగించడంతో కందులాపురం, సైదాపురం, నడింపల్లి గ్రామల ప్రజలు పంటపొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పట్టాల అవతల సుమారు 600 ఎకరాల పంటపొలాలున్నాయని ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని వివరించారు. రైతులు, ప్రజలు రాకపోకలు సాగించేందుకు రైల్వే అండర్ పాస్ నిర్మించాలని స్థానిక ప్రజలు, రైతులు కోరారు.



మూడు నెలలుగా వ్యవసాయ బోర్లకు విద్యుత్ లేదని కలెక్టర్‌కు చెబుతున్న సూరేపల్లి రైతులు



మదర్ థెరిసా కాలనీకి లింక్ రోడ్డు నిర్మించాలని కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న కందులాపురం సర్పంచ్

సర్వీస్ రోడ్ల విస్తరణతో జీవనోపాధిపై దెబ్బ

బేస్తవారిపేట: నేషనల్ హైవే సర్వీస్ రోడ్లను విస్తరించడంతో తమ షాపులు కోల్పోయి జీవనోపాధిపై దెబ్బ పడుతుందని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు దుకాణ యజమానులు వినతిపత్రం అందజేశారు. బేస్తవారిపేటలో అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్లను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. కిలోమీటర్ మేర రోడ్డును విస్తరించకపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారడం, విస్తరణలో ఎదురవుతున్న సమస్యలపై కలెక్టర్ ఆరా తీశారు. కొన్ని దుకాణాలు 10 అడుగుల పొడువుతో ఉన్నాయని విస్తరణకు 10-20 అడుగులు తీసుకుంటే జీవనాధారం లేకుండా పోతుందని వ్యాపారులు వివరించారు. ఇప్పుడున్న రోడ్డు కాకుండా వేరే ప్రాంతం నుంచి బైపాస్ నిర్మించాలని కోరారు.

☛ బేస్తవారిపేట ఇస్లాంపేటలో ఉర్దూ ప్రాథమిక పాఠశాల భవనాలు అసంపూర్తిగా నిలిచిపోవడంతో పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు. బేస్తవారిపేటలో బస్‌షెల్టర్ లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని, స్థలం ఉన్నప్పటికీ షెల్టర్ నిర్మించకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు వివరించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ జితేంద్ర కుమార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పేదలను ఆదుకోవడానికే పీ4

గిద్దలూరు రూరల్: పట్టణంలోని బాలసదన్‌ను మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించి వసతుల కల్పనపై సిబ్బందిని ఆరాతీశారు. అనంతరం నరవ రోడ్డులోని సీతారామ కల్యాణ మండపంలో పీ4 కార్యక్రమంపై అధికారులతో చర్చించారు. సమాజంలోని నిరుపేదలను గుర్తించి ఆర్థిక చేయూత ఇవ్వడమే పీ4 ఉద్దేశమని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి విజయవంతం చేయాలని కోరారు. గిద్దలూరు నియోజకవర్గంలో 5 వేల పేద బంగారు కుటుంబాలను గుర్తించామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి వెంకటశివరామిరెడ్డి, కమిషనర్ ఈ.వి.రమణబాబు, తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



హైవే సర్వీస్ రోడ్ల విస్తరణపై కలెక్టర్‌కు వివరిస్తున్న అధికారులు

పులులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి

- ఎఫ్‌ఆర్‌ఓ ప్రసన్న జ్యోతి సూచన

మార్కాపురం: పులులు కనిపిస్తే తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని మార్కాపురం అటవీశాఖ ఎఫ్‌ఆర్‌ఓ ప్రసన్న జ్యోతి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జి.నాగరాజు ప్రజలకు సూచించారు. మంగళవారం టైగర్స్ డేను పురస్కరించుకుని మార్కాపురం అటవీశాఖ పరిధిలోని గుండంచర్ల వద్ద ఉన్న కాటంరాజు బేస్‌క్యాంపులో ప్రజలకు అవగాహన కల్పించి 200 మొక్కలు నాటి, గుడి ప్రాంగణంలో ఉన్న ప్లాస్టిక్‌ను తీసివేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పులితోపాటు వన్యప్రాణులు ఏవి కనిపించినా వాటిపై దాడి చేయవద్దని, తమకు సమాచారం అందజేయాలని కోరారు. అడవిలోనికి వెళ్లేప్పుడు తగిన జాగ్రత్తలతోపాటు పాటు అటవీ అధికారుల అనుమతి తీసుకోవాలని, ఇష్టం వచ్చినట్లుగా చెట్లు కొట్టడం, వన్యప్రాణులను వేటాడితే జైలుకు పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అందరూ ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది జాన్సన్, రవికుమార్, బాలాకుమారి, రామసుబ్బారావు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది

పథకాల పేరులో చంద్రబాబు మోసం



రాచర్లలో మాట్లాడుతున్న కేపీ నాగార్జునరెడ్డి

- తప్పుడు కేసులు, కుటిల రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు
- కూటమి ప్రభుత్వ మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరిద్దాం
- వైఎస్సార్ సీపీ గిద్దలూరు ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి

రాచర్ల: ప్రజలకు సూపర్ సిక్స్‌తో సహా 140కి పైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ఏడాదిగా హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి విమర్శించారు. మంగళవారం మండల కేంద్రమైన రాచర్లలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసి కూడా సూపర్ సిక్స్ హామీలు ఇవ్వడం ప్రజలను మోసం చేయడమేనని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల్లో నగదు వస్తుందని నమ్మించి మోసం చేశారని దుయ్యబట్టారు. బాబు మోసాలు, అన్యాయాలు, అక్రమాలను ప్రశ్నిస్తే తప్పుడు కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని, పార్టీలకు, కులమత, రాజకీయాలకు అతీతంగా అర్హులకు లబ్ధి చేకూర్చామని గుర్తు చేశారు. కరోనా కష్టకాలంలో కూడా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు కొనసాగించిన విషయాన్ని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి ప్రతి ఇంటికీ తిరిగి చంద్రబాబు మోసాలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ ఖాశింబి, జెడ్పీటీసీ పగడాల దేవి, శ్రీరంగం, వైస్ ఎంపీపీ ఎలిశమ్మ, మండల కన్వీనర్ యేలం మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధికారి ప్రతినిధి బైర్ల దేవదాసు, మండల సీనియర్ నాయకుడు సూరా స్వామిరంగారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ బాషు, అనుములపల్లె సర్పంచ్ రమేష్, ఎస్సీ సెల్ స్టేట్ జాయింట్ సెక్రటరీ బద్దెటి ప్రవీణ్‌కుమార్, ఆకవీడు, రాచర్ల మాజీ సర్పంచులు సూర పాండురంగారెడ్డి, సాదుల పాపిరెడ్డి, మండల కో ఆప్షన్ మాజీ సభ్యుడు షేక్.పల్నాటి మహబూబ్‌పీరా, నాయకులు షేక్.ఇస్మాయిల్, విశ్రాంత తహసీల్దార్ చల్లా వెంకటేశ్వర్లు, డాక్టర్ పుల్లారెడ్డి, సొంటం రమణారెడ్డి, పాలుగుళ్ల శివారెడ్డి, జి.పుల్లారెడ్డి, ఎస్.రంగస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



గిద్దలూరులో కేపీని సత్కరిస్తున్న కార్యకర్తలు

గిద్దలూరు రూరల్: బాబు షూరిటీ మోసం గ్యారంటీ నినాదంతోపాటుగా బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత వైఎస్సార్ సీపీ శ్రేణులపై ఉందని ఆ పార్టీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కె.పి.నాగార్జునరెడ్డి దిశానిర్దేశం చేశారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మున్సిపల్ పరిధిలోని 20 వార్డులకు చెందిన నాయకులతో మంగళవారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేపీ మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దౌర్జన్యాలకు దిగడమే కాకుండా అక్రమ అరెస్ట్‌లతో భయభ్రాంతులకు గురిచేస్తోందని ధ్వజమెత్తారు. పార్టీ కోసం పని చేసే కార్యకర్తలను ఎప్పటికీ విస్మరించబోమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వేమిరెడ్డి రామచంద్రారెడ్డి, మానం బాలిరెడ్డి, నంద్యాల బాలసుబ్రహ్మణ్యం యాదవ్, సూరేపల్లె రామకృష్ణ, పోలేపల్లె శివ, గోడి వెంకటేశ్వరరెడ్డి, స్వామిరంగారెడ్డి, పాలుగుళ్ల సుబ్బారెడ్డి, వెంకటరావు, జింకా రమేష్‌యాదవ్, పాలుగుళ్ల నరసింహారెడ్డి, మానం రమణారెడ్డి, మిత్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అధునాతన పోస్టల్ సేవలు

- పోస్టల్ సూపరింటెండెంట్ జీవీ శ్రీనివాసులు



మాట్లాడుతున్న జీవీ శ్రీనివాసులు

మార్కాపురం: పోస్టల్ శాఖలో అధునాతన సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని మార్కాపురం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ జీవీ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 22 తేదీ నాటికి పోస్టల్ శాఖలో సాఫ్ట్‌వేర్ వెర్షన్ 2.0 అప్‌డేట్ అయిందని, ఖాతాదారులకు వేగంగా సేవలు అందిస్తున్నామన్నారు. డాక్ సేవా యాప్ కూడా అందుబాటులోకి వచ్చిందని, వినియోగదారులు తమ సెల్‌ఫోన్‌లోనే యాప్ ఉపయోగించి స్పీడ్ పోస్టు, రిజిస్టర్ పోస్ట్, పార్శిళ్లు ఇంటి వద్దనే బుక్ చేసుకోవచ్చని వివరించారు. పోస్టాఫీసుకు వచ్చి బుకింగ్ కోసం వేచిచూడాల్సిన పనిలేదన్నారు. పోస్టాఫీసులో కూడా క్యూఆర్ కోడ్ ద్వారా నగదు చెల్లింపులు చేయవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా పోస్టల్ శాఖ ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నామని చెప్పారు. ప్రతి బ్రాంచ్ పోస్టాఫీసు పరిధిలో రాబోయే 8 నెలల్లో ఒక్కో బీపీఎం 370 సేవింగ్ అకౌంట్స్, సబ్ పోస్టుమాస్టర్ 750 అకౌంట్లు, హెడ్ పోస్టాఫీసులో 2వేల సేవింగ్స్ అకౌంట్లను నూతనంగా ప్రారంభించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు వెల్లడించారు. సమగ్రమైన సమాచారం కోసం సమీపంలో ఉన్న పోస్టుమాస్టర్లను సంప్రదించాలని డివిజన్ సూపరింటెండెంట్ సూచించారు.

చెరువుకట్ట రోడ్డుకు మరమ్మతులు


సాక్షి
పదరాని పాట్లు.. సర్కస్ ఫీట్లు..

సాక్షిలో ప్రచురితమైన కథనాలు

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం: ఎట్టకేలకు మార్కాపురం చెరువుకట్ట రోడ్డు మరమ్మతులకు మోక్షం లభించింది. ప్రధానమైన చెరువు కట్ట రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్న వైనంపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురించడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టారు. రోడ్డుపై గుంతలను పూడ్చి తారు వేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి పలువురు వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.



చెరువుకట్ట రోడ్డుపై గుంతలు పూడ్చిన దృశ్యం